సాక్షి రంగారెడ్డి

శనివారం । 21 । జూన్ । 2025



దేశంలో మతోన్మాద పాలన

కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. 10లో▸



నిబంధనలొద్దు!

జీహెచ్ఎంసీలో ఆయా విభాగాల మధ్య సమన్వయ లోపంతో రోడ్డు నిబంధనలు సవ్యంగా అమలు కావడం లేదు. 10లో▸



నీటి ట్యాంకర్ల సీజ్

పొలాల వద్ద బోర్ల నుంచి నీటిని నింపి ఇతర అవసరాలకు తరలిస్తున్న లారీలను అధికారులు సీజ్ చేశారు. 10లో▸

న్యూస్‌రీల్

కాలిపోయిన డమ్మీ హెలికాప్టర్



మంటలు ఆర్పుతున్న స్థానికులు

బడంగ్‌పేట్: ఓ డమ్మీ హెలికాప్టర్ కాలిపోయిన సంఘటన కార్పొరేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గుర్రంగూడలోని పోచమ్మ టెంపుల్ పక్కన గోకార్టింగ్ ఎదురుగా కొన్నేళ్ల క్రితం సినిమా షూటింగ్ కోసం డమ్మీ హెలికాప్టర్ తయారు చేయించారు. షూటింగ్ అయిపోయిన తర్వాత రోడ్డు పక్కన మైదానంలో ఉంచారు. శుక్రవారం అకస్మాత్తుగా అది కాలిపోయింది. స్థానికులు గమనించి మంటలు ఆర్పేశారు. అనంతరం మీర్‌పేట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. హెలికాప్టర్ కాలిపోతున్న దృశ్యాలను కొందరు వీడియోలు తీసి వైరల్ చేశారు. అది చూసి అంతా నిజమైన హెలికాప్టర్‌కు ప్రమాదం జరిగిందని అనుకున్నారు. ప్రమాదంలో కాలిపోయిందా లేక గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనుల పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న ఎఫ్‌సీడీఏ కమిషనర్ శశాంక

కందుకూరు: మండలంలోని మీర్‌ఖాన్‌పేట రెవెన్యూలో నిర్మాణంలో ఉన్న స్కిల్స్ యూనివర్సిటీని శుక్రవారం ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కమిషనర్ శశాంక సందర్శించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం అక్కడి సైట్ ఇంజినీర్లతో మాట్లాడారు. ఎక్కడెక్కడ ఎలాంటి నిర్మాణాలు రానున్నాయి, ఇప్పటి వరకు ఎంత మేర పనులు చేశారని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట టీజీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రావణ్‌కుమార్, తహసీల్దార్ గోపాల్ ఉన్నారు.

టీచర్లు ఫంక్షన్‌కి.. పాఠాలు గాలికి



పాటిగడ్డలోని కేజీబీవీ

కేశంపేట: విద్యార్థినులకు పాఠాలు బోధించాల్సిన ఉపాధ్యాయులు ఏడుగురు మూకుమ్మడి సెలవు పెట్టి ఫంక్షన్‌కు వెళ్లారు. మండల పరిధిలోని పాటిగడ్డ కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం, కళాశాల (కేజీబీవీ)లో సుమారు 350 మంది విద్యార్థినులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇక్కడ ఆరు నుంచి ఇంటర్మీడియెట్ వరకు తరగతులు కొనసాగుతున్నాయి. పాఠశాల ఎస్ఓగా గౌసియాబేగం విధులు నిర్వర్తిస్తున్నారు. వీరి స్వగ్రామమైన మహబూబ్‌నగర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విందుకు ఉపాధ్యాయులు కవిత, మంజుల, సుశీల, గౌసియాబేగం, రజిత, అలేఖ్య, వరలక్ష్మి హాఫ్‌డే సెలవు అంటూ లెటర్ పెట్టుకొని వెళ్లారు. పాఠశాలలో ముగ్గురు మాత్రమే ఉన్నారు. ఇలా పిల్లలను వదిలేసి అంతా ఫంక్షన్‌కు వెళ్లడం చర్చనీయాంశమైంది.

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో నెలకొన్న సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీకాంత్ మాట్లాడుతూ.. ప్రభుత్వ వసతి గృహాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయన్నారు. వాటిలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రాత్రివేళల్లో గిరిజన వసతి గృహానికి వాచ్‌మెన్ లేకపోవడంతో భద్రత లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ అలుపెరగని పోరాటం చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శివశంకర్, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములకు రక్షణ

రూ.వందల కోట్ల విలువైన స్థలాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

- సర్వే నంబర్ల వారీగా గుర్తింపు
- కబ్జాల చెర నుంచి విముక్తి
- హద్దులు నిర్ణయించి హెచ్చరిక బోర్డుల ఏర్పాటు
- ఫెన్సింగ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వ భూములకు హద్దులు నిర్ణయించి, హెచ్చరిక బోర్డులతో పాటు ఆయా భూముల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు రెవెన్యూ యంత్రాంగం కసరత్తు చేస్తోంది. గ్రామాలు, సర్వే నంబర్ల వారీగా భూముల వివరాలు సేకరించే పనిలో నిమగ్నమైంది. ఇప్పటికే మెజార్టీ భూములు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లాయి. కొన్ని కోర్టు వివాదాల్లో చిక్కుకున్నాయి. ఏ వివాదం లేని ఖాళీ భూములకు హద్దులు నిర్ణయించే పని కొనసాగుతోంది. ఇప్పటికే కొన్ని మండలాల్లో భూముల చుట్టూ ఫెన్సింగ్ వేయగా, మరికొన్ని మండలాల్లో సర్వే కొనసాగుతోంది. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. ఫెన్సింగ్ వైర్లు, కడీలు, హెచ్చరిక బోర్డులు, కూలీల చార్జీల చెల్లింపు కోసం అయ్యే ఖర్చులకు అంచనాలు రూపొందించి, కలెక్టర్‌కు పంపారు. నిధులు మంజూరు కావడమే ఆలస్యం ఆయా భూముల చుట్టూ ఫెన్సింగ్ వేయనున్నారు. పట్టణ భూపరిమితి చట్టం (యూఎల్‌సీ)లో తొమ్మిది వేల ఎకరాల యూఎల్‌సీ భూములు ఉన్నాయి. వీటిలో 840 ఎకరాలు కోర్టు కేసుల్లో చిక్కుకున్నాయి. ఆయా భూముల సర్వే నంబర్లు సహా కోర్టుల్లో హియరింగ్ తేదీలను తెలుసుకునేందుకు కొత్తగా ఈ కోర్టు పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఆయా భూముల విస్తీర్ణం, నేపథ్యం, కేసు పూర్వాపరాలను క్షేత్రస్థాయిలోని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మొదలు..కలెక్టర్ వరకు అధికారులంతా తెలుసుకునే వెసులుబాటు కల్పించారు.

గుర్తించినవి ఇవీ..

- సరూర్‌నగర్ సర్వే నంబర్ 9/7లోని 3.23 ఎకరాలు, సర్వే నంబర్ 9/1లో 0.24 ఎకరాలు, సర్వే నంబర్ 9/1పీలో 0.39 ఎకరాలు, సర్వే నంబర్ 9/1లో 400 గజాలు, సర్వేనంబర్13లో 2 ఎకరాల ప్రభుత్వ భూములను గుర్తించారు. లింగోజిగూడ సర్వే నంబర్ 86లో 1.21 ఎకరాలు, మన్సూరాబాద్ సర్వే నంబర్ 4/పీలో 0.23 ఎకరాలు, చంపాపేట్ సర్వే నంబర్ 3లోని 850 గజాలు, బైరమల్‌గూడ సర్వే నంబర్ 24లో 0.10 ఎకరాలు, కర్మన్‌ఘాట్ సర్వే నంబర్ 51లో ఎకరం, సర్వే నంబర్ 73/1లో 2000 గజాలు, గడ్డిఅన్నారం సర్వే నంబర్ 31/2లో 104 గజాలను గుర్తించారు.
- కేశంపేట మండల పరిధిలోని వేములనర్వ సర్వే నంబర్ 119లో 15.27 ఎకరాలు, సర్వే నంబర్ 120లో 12.08 ఎకరాలు, సర్వే నంబర్ 121లో 10.06 ఎకరాలు, సర్వే నంబర్ 122లో 13.03 ఎకరాలు (మొత్తం 51.04 ఎకరాలు) ఉన్నట్లు గుర్తించి, ఆయా భూముల చుట్టూ ఫెన్సింగ్ చేశారు. బైర్‌ఖాన్‌పల్లి సర్వే నంబర్ 53/1లో 15 ఎకరాలు ఉన్నట్లు గుర్తించి ఫెన్సింగ్ పనులు చేపట్టారు. కేశంపేట సర్వే నంబర్ 70లో సుమారు మూడు ఎకరాలు ఉన్నట్లు గుర్తించి ఫెన్సింగ్ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశారు.
- కడ్తాల్ మండల పరిధిలో 15 రెవెన్యూ గ్రామాలు ఉండగా కడ్తాల్, కర్కల్‌పహాడ్‌లో 110 ఎకరాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు ఆయా భూముల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అన్మాస్‌పల్లి సర్వే నంబర్ 129లో 1.24 ఎకరాలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. కడ్తాల్ సర్వే నంబర్ 260లోని 80 ఎకరాల చుట్టూ హద్దురాళ్లు నాటారు.
- గండిపేట మండల పరిధిలోని గంధంగూడ సర్వే నంబర్62లో 5 ఎకరాలు, సర్వే నంబర్ 43లో ఐదు ఎకరాలు, సర్వే నంబర్ 62లో ఐదు గుంటలు, కిస్మత్‌పూర్ సర్వే నంబర్ 159లో 159.10 ఎకరాలు, సర్వే నంబర్ 86లో 15 గుంటలు, కోకాపేట సర్వే నంబర్ 100లో 35 ప్లాట్లు, సర్వే నంబర్ 117లో రెండు ఎకరాలు, బండ్లగూడ సర్వే నంబర్ 50లో ఐదు గుంటలు, వట్టినాగులపల్లి సర్వే నంబర్ 132లో 56 ఎకరాలు, సర్వే నంబర్ 130లో 17.27 ఎకరాలు, సర్వే నంబర్ 274లో 8 ఎకరాలు, సర్వే నంబర్ 275లో 5.28 ఎకరాలు, సర్వే నంబర్ 294లో 13 గుంటలు ఉన్నట్లు గుర్తించారు. పుప్పాల్‌గూడ సర్వే నంబర్ 290లో ఎకరం, మణికొండ సర్వే నంబర్ 84లో ఎనిమిది గుంటలు, సర్వే నంబర్ 229లో నాలుగు గుంటలు, నార్సింగి సర్వే నంబర్ 134లో ఎకరం, సర్వే నంబర్ 126లో మూడు ఎకరాలు, మంచిరేవుల సర్వే నంబర్ 283లో 10 గుంటలు, బైరాగిగూడ సర్వే నంబర్ 15లో పది గుంటలు ఉన్నట్లు తేల్చారు. ఇప్పటికే ఆయా భూముల్లో ఆక్రమణలు తొలగించారు. ఫెన్సింగ్ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి, నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి పంపారు.
- మొయినాబాద్ మండలం కనకమామిడిలో 200 ఎకరాలు, పెద్దమంగళారంలో 300 ఎకరాలు, చిలుకూరులో 30 ఎకరాలు, అజీజ్‌నగర్‌లో 150 ఎకరాలు గుర్తించారు. చుట్టూ ఫెన్సింగ్ వేసి బోర్డులు పెట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.
- ఇబ్రహీంపట్నం మండలం ఆదిబట్ల, ఖానాపూర్, రామిరెడ్డిగూడ, దండుమైలారం, నాగన్‌పల్లి, మంగల్‌పల్లి, నర్రేపల్లిలో 60 ఎకరాలకుపైగా గుర్తించారు. ఆయా భూముల ఫెన్సింగ్ కోసం రూ.40 లక్షలకుపైగా ఖర్చవుతుందని అంచనా వేశారు.
- చేవెళ్ల మండలం హస్తేపూర్, అంతారం, కమ్మెట, కందవాడ, పామెన, కుమ్మెర, రావులపల్లిలో 200పైగా ఎకరాలు ఉన్నట్లు గుర్తించారు. హద్దులను నిర్ధారించి, హెచ్చరిక బోర్డులు నాటేందుకు సిద్ధం చేస్తున్నారు.



కేశంపేట మండలంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

సారాపై ఉక్కుపాదం

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ్

ఆమనగల్లు: గ్రామాలు, తండాల్లో నాటుసారా, గుడుంబా నిరోధానికి కఠినంగా వ్యవహరించాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ్ సూచించారు. డ్రగ్స్, నాటుసారా రహిత తెలంగాణ కోసం అందరూ సహకరించాలని కోరారు. పట్టణంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఎక్సైజ్ డీపీఈఓ ఉజ్వలారెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాల్లో కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివిధ కేసుల్లో పట్టుబడిన నాటుసారాను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా దశరథ్ మాట్లాడుతూ.. అనుమతిలేకుండా ఫంక్షన్‌హాళ్లు, రిసార్ట్స్, ఫాం హౌస్‌ల్లో మద్యం వినియోగించరాదని అన్నారు. గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అంతకుముందు గీత కార్మికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ బద్యానాథ్‌చౌహాన్, ఎస్ఐలు కృష్ణప్రసాద్, అరుణ్‌కుమార్, స్వప్న, సిబ్బంది శంకర్, సురేశ్ బాబు, దశరథ్, ఉపేందర్, బాబు, నర్సింహ, శ్రీను, శ్రీజ, ఆమని తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి..

కడ్తాల్: గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ్, సరూర్‌నగర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ ఉజ్వాలా రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ముద్వీన్‌లో నీరా తయారీ కేంద్రాన్ని శుక్రవారం వారు పరిశీలించారు. కేంద్రంలో తయారవుతున్న ఉత్పత్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చరికొండ, ముద్వీన్, నాగిళ్ల, శెట్టిపల్లి తదితర గ్రామాల నుంచి హైదరాబాద్‌కు కల్లు రవాణా చేసేవారితో సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్, ఎస్ఐలు కృష్ణప్రసాద్, అరుణ్‌కుమార్, స్వప్న పాల్గొన్నారు.



చరికొండలో గీత కార్మికులతో మాట్లాడుతున్న దశరథ్

సర్కారు బడులను బలోపేతం చేయాలి

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని తపస్ (తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం) రాష్ట్ర అధ్యక్షుడు హన్మంత్‌రావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాల (కుంటబడి), ఫరూఖ్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మండల పరిధిలోని కిషన్‌నగర్, మొగిలిగిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హన్మంత్‌రావు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం తపస్ అలుపెరగని పోరాటం చేస్తోందన్నారు. ఎన్నో ఏళ్ల పోరాటం ఫలితంగా ప్రభుత్వ ఉద్యోగులకు త్వరలో హెల్త్ కార్డులు రాబోతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కోట్ల కాశీరావు, జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, రైతులు

ఎనికేపల్లి రైతులకు న్యాయం చేయండి

కలెక్టర్ నారాయణరెడ్డికి చేవెళ్ల ఎమ్మెల్యే వినతి

మొయినాబాద్: గోశాల ఏర్పాటుతో భూములు కోల్పోతున్న ఎనికేపల్లి రైతులకు న్యాయం చేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కలెక్టర్ నారాయణరెడ్డికి విన్నవించారు. ఈ మేరకు శుక్రవారం రైతులతో కలిసి వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ పరిధిలోని ఎనికేపల్లి సర్వేనంబర్ 180లోని 99.14 ఎకరాల భూమిని సాగుచేసుకుంటున్న రైతులంతా పేదకుటుంబాలకు చెందినవారని అన్నారు. ఈ భూములను గోశాల కోసం తీసుకుంటే రైతులకు ఎకరాకు వెయ్యి గజాల చొప్పున పరిహారం ఇవ్వాలని కోరారు. ఈ విషయంలో రెండు రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి మాట్లాడతామని.. అప్పటి వరకు గోశాల ఏర్పాటు పనులు చేపట్టొద్దని అన్నారు. కలెక్టర్‌ను కలిసినవారిలో టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీకాంత్, మాజీ సర్పంచ్ అమర్‌నాథ్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాంరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ రమేష్ తదితరులు ఉన్నారు.

మున్సిపాలిటీల్లో 'ఉపాధి' ప్రారంభించాలి

షాద్‌నగర్: మున్సిపాలిటీల్లో ఉపాధి హామీ పనులు ప్రారంభించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ.. మున్సిపాలిటీల్లో పేదలకు కూలి పనులు చేసుకునే అవకాశం లేకుండా పోయిందన్నారు. ఉపాధి హామీ పథకాన్ని అమలు చేసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీల సమస్యల సాధన, భవిష్యత్తు కార్యాచరణ రూపొందించేందుకు వచ్చే నెల 5,6 తేదీల్లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం ఫరూఖ్‌నగర్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాములు, ప్రధాన కార్యదర్శిగా రాజు నాయక్, ఉపాధ్యక్షులుగా జంగయ్య, శంకర్, కార్యదర్శులుగా రాములుగౌడ్, చెన్నయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు బుద్దుల జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

జోలె పట్టి విరాళాల సేకరణ

చెత్త ట్రాక్టర్ డీజిల్ ఖర్చుల కోసం..

ఆమనగల్లు: ప్రభుత్వం పంచాయతీల నిర్వహణకు నిధులు ఇవ్వడం లేదని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. పంచాయతీల్లో చెత్త సేకరించే ట్రాక్టర్ నిర్వహణ కోసం విరాళాలు సేకరించి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. తలకొండపల్లి మండలం గట్టుప్పలపల్లిలో కొన్ని రోజులుగా చెత్త ట్రాక్టర్ లేకపోవడంతో ఎక్కడిచెత్త అక్కడే పేరుకుపోయింది. దీంతో గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వెంకటయ్య, బీఆర్ఎస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి గ్రామ కార్యదర్శిని సంప్రదించగా ట్రాక్టర్ నడిపించడానికి డీజిల్ లేదని సమాధానం ఇచ్చారు. దీంతో వారు వెంటనే గ్రామంలో తిరిగి జోలెపట్టి విరాళాలు సేకరించారు. వచ్చిన రూ.11,350ను పంచాయతీ సిబ్బందికి అందించారు. కనీసం డీజిల్ ఖర్చులు కూడా ప్రభుత్వం అందించకపోతే పారిశుద్ధ్య పనులు ఎలా చేపడతారని వారు ప్రశ్నించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజు, జంగయ్య, శరత్‌చంద్రశర్మ, అశోక్‌గౌడ్, కృష్ణయ్య, జైపాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, కృష్ణయ్య, రాజు, విజేందర్, నర్సింహ, జీవ, కొండల్, ఆంజనేయులు, యాదయ్య, శరత్చంద్ర తదితరులు పాల్గొన్నారు.



విరాళాలు సేకరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించండి

జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ పరిధిలో రోడ్ల పక్కన మార్జిన్లలో, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించాల్సిందిగా జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ సర్కిళ్ల అధికారులను ఆదేశించారు. జోనల్ కమిషనర్లు రెగ్యులర్‌గా కూల్చివేతలు జరిగేలా చూడాలన్నారు. ఈ మేరకు సర్క్యులర్ జారీ చేశారు. ప్రతి వారం కూల్చివేతలు జరగాలని, ప్రతి శనివారం ఆయా సర్కిళ్లలో కనీసం ఒక రోడ్డులో ఆక్రమణల్ని తొలగించాలని ఆదేశించారు. ఇప్పటికే 'రోప్'లో భాగంగా కబ్జాలు తొలగిస్తుండటాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. జీహెచ్ఎంసీ చట్టం, నిబంధనల మేరకు కమిషనర్ అనుమతి లేకుండా ఫుట్‌పాత్‌లు, గోడలు తదితర ప్రాంతాల్లో ఎలాంటి వస్తువులు ఉంచరాదని ఈ సందర్భంగా సూచించారు.

ఆరోగ్య యోగం ఆనంద యోగం



యోగాతో ఒత్తిళ్లకు చెక్

- రుగ్మతలకు దివ్య ఔషధం
- రోజంతా ఉల్లాసం.. ఉత్సాహం
- ప్రజల్లో పెరుగుతున్న ఆసక్తి
- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

షాద్‌నగర్: యోగా కేవలం వ్యాయామం మాత్రమే కాదు.. మనస్సును, శరీరాన్ని సంపూర్ణంగా అదుపులో ఉంచే ఒక సాధనం.. యోగా ద్వారా ఆరోగ్యాన్ని, ఆహ్లాదాన్ని పొందొచ్చు.. నిద్రానంగా దాగి ఉన్న శక్తిని వెలికి తీయొచ్చు.. యోగాసనాలు వేయడం ద్వారా ఏకాగ్రత, సంపూర్ణ ఆరోగ్యం కలుగుతాయి.. మానసిక ఒత్తిడిని దూరం చేస్తుంది.. దైనందిన జీవితంలో పని ఒత్తిడిని, అలసటను అధిగమించేందుకు యోగా ఔషధంగా పనిచేస్తుంది.. ప్రజల్లో రోజురోజుకూ దీనిపై ఆసక్తి పెరుగుతోంది.. చిన్నా, పెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరూ యోగా చేయొచ్చు.. నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

సర్వరోగ నివారిణి

యోగా సాధన ద్వారా మనిషిలో ఉన్న సర్వరోగాలు మటుమాయం అవుతాయి. కండరాలకు కావాల్సిన శక్తి రావడంతో పాటు ద్రుఢంగా మారుతాయి. శరీరంలోని అన్ని అవయవాలకు రక్తప్రసరణ చక్కగా జరుగుతుంది. రోగ నిరోధక శక్తి పెరగడంతోపాటు ఉత్సాహంగా ఉండేలా చేస్తుంది. శారీరక, మానసిక ప్రశాంతత, మనో బలం, సంగ్రహణ శక్తి పెంపొందుతాయి. ధ్యానం చేయడం ద్వారా ఏకాగ్రత పెంచుకోవచ్చు.

ఆసనాల్లో అనేక రకాలు

యోగాసనాల్లో చాలా రకాలు ఉన్నాయి. నిలబడి, కూర్చొని, పడుకొని చేసే ఆసనాలు ఉన్నాయి. వజ్రాసనం, అర్ధ ఉష్ట్రాసనం, శశాంకాసనం, ఉత్తానమండూకాసనం, వక్రాసనం, మకరాసనం, తడాసనం, వృక్షాసనం, పాదహస్తాసనం, అర్ధచక్రాసనం, త్రికోణాసనం, భద్రాసనం, సరళభుజంగాసనం, పవన యుక్తాసనం, శలభాసనం, సేతు బంధాసనం, ఉత్తానపాదాసనం, అర్ధహలాసనం, పవన ముక్తాసనం, శవాసనం ఇలా అనేక రకాలు ఉన్నాయి. ప్రాణాయామాలు కపాల భాతి, అనులోమ విలోమ, శీతలీ ప్రాణాయామం, భ్రమరీ ప్రాణాయామం, ధ్యానం ఉన్నాయి.

విస్తరిస్తున్న యోగా

యోగా క్రమక్రమంగా గ్రామీణ ప్రాంతాలకు సైతం విస్తరిస్తోంది. చాలా మంది యోగాసనాలు వేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతిరోజు కొంత సమయాన్ని యోగాకు కేటాయిస్తున్నారు. తెల్లవారుజాము మొదలు ఉదయం సూర్యకిరణాలు బాగా వచ్చేంత వరకు సాధన చేస్తున్నారు. వృద్ధాశ్రమాల్లో పతంజలి యోగా సమితి వారు యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఆశ్రమాల్లో చాలా మంది వయస్సుపై బడిన వారు ఉండటంతో ఏదో ఒక రకమైన ఆరోగ్య సమస్యతో బాధపడుతుంటారు. సమస్యను దూరం చేసుకునేందుకు యోగా సాధన చేస్తున్నారు.



షాద్‌నగర్‌లో యోగా సాధన చేస్తున్న స్థానికులు (ఫైల్)

రోగ నిరోధక శక్తి



నిత్యం యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారు. శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. శరీరం ఉల్లాసంగా ఉంటుంది. ప్రతి ఒక్కరూ రోజు కొంత సమయాన్ని యోగాకు కేటాయించాలి.

– శ్రీజారెడ్డి, యోగా శిక్షకురాలు, షాద్‌నగర్

ఒత్తిళ్లను అధిగమించొచ్చు



నిత్య యోగా సాధనతో మానసిక, శారీరక ఒత్తిళ్లను అధిగమించొచ్చు. అన్ని అవయవాలకు రక్తప్రసరణ మంచిగా జరుగుతుంది. అలసటను పూర్తిగా తగ్గిస్తుంది. రోగాలకు ఆస్కారం ఉండదు.

– పానుగంటి శ్రీధర్, పతంజలి యోగా సమితి వ్యవస్థాపకుడు, షాద్‌నగర్

నీటిని తరలిస్తున్న ట్యాంకర్ల సీజ్


సీజ్ చేసిన ట్యాంకర్ల వద్ద అధికారులు

శంకర్‌పల్లి: పంట పొలాల వద్ద బోర్ల నుంచి అక్రమంగా నీటిని నింపి ఇతర అవసరాలకు తరలిస్తున్న లారీలను శుక్రవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. శంకర్‌పల్లి తహసీల్దార్ సురేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని జన్వాడలో కొంత మంది వ్యక్తులు వ్యవసాయ బోర్ల నుంచి వ్యవసాయేతర అవసరాల నిమిత్తం నీటిని ట్యాంకర్ల ద్వారా వాడుతున్నట్లు పక్కా సమాచారం అందింది. దీంతో ఆర్‌ఐ తేజ, ఇతర సిబ్బంది కలిసి జన్వాడ గ్రామానికి వెళ్లారు. ఆ సమయంలో అక్కడ నీటిని నింపుకొంటున్న 6 ట్యాంకర్లను గుర్తించారు. ఆ వ్యవసాయ భూములకు సంబంధించిన విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. నీటిని నిల్వ చేసేందుకు తవ్వించిన గుంతలను జేసీబీ సాయంతో కూల్చివేయించారు. అనంతరం సీజ్ చేసిన లారీలను మోకిల పోలీసులకు అప్పగించినట్లు తహసీల్దార్ తెలిపారు.

అదృశ్యమైన చిన్నారులు క్షేమం


చిన్నాన్న, చిన్నమ్మలతో రేణుక, సంతోష్‌లు

శంకర్‌పల్లి: ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయిన ఇద్దరు చిన్నారుల కథ చివరికి సుఖాంతం అయింది. శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం సేడం తాలుకాలోని మోత్కుపల్లి గ్రామానికి చెందిన సంతోష్‌కుమార్, నాగమ్మలు దంపతులు. వీరు కొన్నేళ్ల క్రితం బతుకుదెరువు కోసం శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని బంగ్లగడ్డకి వచ్చారు. అప్పటి నుంచి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే వీరికి రేణుక(13), సంతోష్(8) అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. పాఠశాలలకు సెలవులు రావడంతో సొంతూరికి వెళ్లిన పిల్లలిద్దరూ ఇటీవల శంకర్‌పల్లికి వచ్చారు. ఇంట్లో ఇతర విషయాలపై తల్లి మందలించడంతో చిన్నారులిద్దరూ కలిసి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయారు. తల్లిదండ్రులు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేశారు. చివరికి చిన్నారులు ఇద్దరూ వారి సొంత ఊరిలో తన చిన్నాన్న ఇంటికి చేరుకున్నట్లు గుర్తించారు. చిన్నారులు కనిపించకకుండా పోయారనే వార్తతో శుక్రవారం శంకర్‌పల్లి అంతా అలజడి వాతావరణం నెలకొంది.

SSC/INTER FAIL
DON'T WORRY
PASS IN ONE
SITTING NIOS
8328443702
9515957607

థాయ్ ఎయిర్‌లైన్స్ విమానంలో సాంకేతిక లోపం

శంషాబాద్: బ్యాంకాక్ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరిన థాయ్ ఎయిర్‌లైన్స్ విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. శుక్రవారం బ్యాంకాక్ నుంచి హైదరాబాద్‌కు టేకాఫ్ తీసుకుంటున్న విమానంలో సాంకేతిక సమస్యను గుర్తించిన పైలట్లు దానిని వెంటనే నిలిపివేసి ప్రయాణికులను దింపేశారు. సాయంత్రం వరకూ అక్కడి నుంచి చేరుకోవాల్సిన ప్రయాణికులు హైదరాబాద్‌కు చేరుకోలేదని ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి.

ప్రమాదవశాత్తు కిందపడి కార్మికుడి మృతి

షాద్‌నగర్‌రూరల్: పరిశ్రమలో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కార్మికుడు కిందపడి మృతి చెందిన సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చిల్కమర్రి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. శంషాబాద్ మండలం ఊటుపల్లి గ్రామానికి చెందిన అల్వాల్‌రెడ్డి(51) చిల్కమర్రిలోని బ్యాటరీ పరిశ్రమలో కొంత కాలంగా వెల్డర్‌గా పని చేస్తున్నాడు. అక్కడే పైఅంతస్తులో వెల్డింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడిన ఆయనకి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గమనించిన తోటి కార్మికులు చికిత్స నిమిత్తం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. క్షతగాత్రుడిని పరీక్షించిన వైద్యులు అల్వాల్‌రెడ్డి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. విషయం తెలుసుకున్న కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్ ఆసుపత్రికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

యోగా డే ను విజయవంతం చేయండి

సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి క్రీడా మైదానంలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఏర్పాట్లపై సమీక్షించారు. యోగా శిక్షకులు, మెడికోలు, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 5,500 మంది పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, శ్రీహరి, నగర మేయర్ విజయలక్ష్మి, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారని వివరించారు.

నిధులే ముద్దు.. నిబంధనలొద్దు!

'రోడ్ సేఫ్టీ' లేకుండా జీహెచ్‌ఎంసీ ఇంజినీర్ల నిర్లక్ష్యం

- సైనేజీలు, లేన్‌మార్కింగ్‌లు, నేవిగేషన్‌లు పట్టవు
- పాఠశాలలున్నా.. ప్రమాదాలు జరిగినా అంతే..
- అడ్డగోలుగా రోడ్ల నిర్మాణం, ఎక్కడపడితే అక్కడ రంబుల్‌స్ట్రిప్స్
- ఎట్టకేలకు నిద్రలేచిన బల్దియా యంత్రాంగం

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లకు కాంట్రాక్టర్లతో కలిసి రోడ్లు వేయకుండానే బిల్లులు కాజేయడం తెలుసు. ఎక్కడా లేని నిబంధనలతో కావాల్సిన వారికే టెండర్లు కట్టబెట్టడమూ తెలుసు. నాణ్యత లేమితో తూతూమంత్రంగా పనులు చేయడమూ తెలుసు. ఎటొచ్చీ జేబులు నింపుకొనేందుకు చూపిస్తున్న శ్రద్ధ ప్రజలకు ప్రమాదాలు జరగకుండా ఉండటంపై చూపడం లేదు. నాసిరకం రోడ్లే కాదు.. రోడ్డు ప్రయాణాలు చేసేవారికి చూపాల్సిన మార్గదర్శకాలు పట్టించుకుంటే ఒట్టు. చివరకు సైనేజీలపైనా శీతకన్నే. సైనేజీలు, లేన్‌మార్కింగ్‌లు, అడ్డగోలు రంబుల్‌స్ట్రిప్స్ వల్ల ప్రజలకు ఎలా ప్రమాదాలకు ఆస్కారం ఉందో నగరంలో వాహనాల మొబిలిటీ ఎందుకు తగ్గుతుందో జీహెచ్‌ఎంసీలోని మరో విభాగమే క్షేత్రస్థాయిలో సర్వే చేసి లోపాలు తెలియజేయడం విశేషం. అంతేకాదు, రోడ్‌సేఫ్టీ చర్యల్లో భాగంగా.. రహదారుల ప్రమాణాలకు సంబంధించి దేశంలోనే అత్యున్నత సంస్థలైన ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ), మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ హైవేస్ (మోర్త్) ప్రమాణాలకనుగుణంగా ఎలా ఉండాలో సూచిస్తూ జీహెచ్‌ఎంసీ ట్రాఫిక్ విభాగం రూపొందించిన స్టాండర్డ్ ఆపరేషనల్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ)ను జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లు తప్పనిసరిగా పాటించాల్సిందిగా కమిషనర్ ఆదేశించారు.

క్షేత్రస్థాయి సర్వే నివేదిక మేరకు ..

రోడ్ మార్కింగ్‌లు వేస్తున్నామా అంటే వేస్తున్నాం. స్పష్టంగా కనిపించడం లేదు. చార్మినార్ నుంచి బంజారాహిల్స్, హైటెక్ సిటీ దాకా అదే దుస్థితి. రద్దీప్రాంతాల్లో పాదచారులకుకానీ, పాఠశాలల వద్ద విద్యార్థులకు కానీ సురక్షితంగా రోడ్డు దాటేందుకు జీబ్రా లేన్స్ లేవు. అబిడ్స్ వంటి ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి. ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చెందిన గచ్చిబౌలి వంటి ప్రాంతాల్లో సైతం పాదచారులు రోడ్డు దాటేందుకు ముప్పుతిప్పలు పడాల్సి వస్తోంది.

లేన్ మార్కింగ్‌లెందుకు?

బస్సులు వెళ్లేందుకు, సైకిళ్లు, పాదచారుల కోసం వేర్వేరు విభాగాలుగా ఉండేందుకు లేన్ మార్కింగ్‌లు అవసరం.. కానీ నగరంలో చాలా ప్రాంతాల్లో ఇవి కనిపించడం లేదు. దీంతో డ్రైవర్లు లేన్లను మారుస్తుండటంతో బాటిల్‌నెక్స్ ఏర్పడుతున్నాయి. అందుకు తాజా ఉదాహరణ చాదర్‌ఘాట్.

ఈ గుర్తులేవీ?

అవసరమైన ప్రాంతాల్లో 'స్టాప్', 'నో యూ టర్న్' 'ముందుకు స్పీడ్‌బ్రేకర్' ఉంది వంటి హెచ్చరికలు లేవు. ఎన్నో ప్రధాన రహదారులు, జంక్షన్లలోనూ అదే దుస్థితి. జంక్షన్ల వద్ద ఏ దారి ఎటువైపు వెళ్తుందో సూచించే సైనేజీలూ (నేవిగేషన్) లేవు. ఉన్నా ప్రైవేటు ప్రకటనల్లో మూసుకుపోయాయి. దీంతో నగరానికి కొత్తగా వచ్చిన వారికి కానీ, ఇతర ప్రాంతాలకు వెళ్లే నగర ప్రజలకు కానీ ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



రంబుల్‌స్ట్రిప్స్‌తో ప్రమాదాలు

అడ్డదిడ్డంగా ఇష్టానుసారంగా వేసిన రంబుల్‌స్ట్రిప్స్ వేగాన్ని తగ్గించేందుకు బదులు ప్రమాద హేతువులవుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు వాటిని దాటేటప్పుడు అదుపుతప్పి కింద పడిపోతున్నారు. ఓఆర్ఆర్ వంటి ప్రాంతాల్లో పెద్ద వాహనాలు సైతం అదుపు తప్పుతున్నాయి. ఎల్‌బీనగర్ – ఉప్పల్ మార్గంలో తరచూ ప్రమాదాలకు ఇది కూడా కారణమే. రంబుల్‌స్ట్రిప్స్ ఐఆర్‌సీ మార్గదర్శకాల మేరకు 10-17 మిమీ ఎత్తు, 250-300 వెడల్పుతో ఉండాలి. 600 ఎంఎం గ్యాప్‌తో 6 స్ట్రిప్స్ ఉండాలి కానీ నగరంలో ఎత్తు మాత్రం పెంచారు. అవి సైతం ఎక్కడ పడితే అక్కడ కాకుండా పాదచారులు రోడ్డు దాటే మార్గాలకు ముందు, జంక్షన్ల వద్ద ఏర్పాటు చేయాలి. 'రంబుల్‌స్ట్రిప్స్ ముందు ఉన్నాయి' అనే సూచికలు ఉండాలి. సాఫీగా ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండాలి కానీ లోపభూయిష్ట డిజైన్లతో నడుములు విరుగుతున్నాయి.

ఏం చేయాలి ?

లోపాలను చక్కదిద్దడంతో పాటు నగరం విశ్వనగరంగా ఉండాలంటే ఆధునిక సాంకేతికతతో కూడిన కొత్త విధానాలు అందుబాటులోకి తేవాలి. సైనేజీలు, సూచికల వంటి వాటి ఏర్పాటుతోపాటు ప్రజలకు వాటి గురించి అవగాహన కలిగేలా నిరంతరం కార్యక్రమాలుండాలి. స్కూల్స్, హాస్పిటల్స్ ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక గుర్తులుండాలి. 'పాదచారి దారిలో ఉన్నారు', ఓవర్ టేక్ చేయవద్దు, స్పీడ్‌లిమిట్ వంటి సూచనలు రిఫ్లెక్టివ్ బోర్డులతో ఏర్పాటు చేయాలి. జంక్షన్ల వద్ద కౌంట్‌డౌన్ టైమర్లతో కూడిన లైన్లు, పెలికాన్ క్రాసింగ్‌బటన్లు ఉండాలి. రంబుల్ స్ట్రిప్స్ ఇష్టానుసారం కాకుండా అవసరమైన ప్రాంతాల్లోనే వేయాలి.

- బస్‌బేస్, ఆన్‌స్ట్రీట్, ఆఫ్‌స్ట్రీట్ పార్కింగ్ ప్రాంతాలకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలి. ఇరుకు రోడ్లకు, డివైడెడ్ రోడ్లకు వేర్వేరు మార్కింగ్ నిబంధనలుండాలి. ఫ్లై ఓవర్లు, జంక్షన్లు, వలయాకారపు జంక్షన్లు వంటి ప్రాంతాల్లో స్పష్టంగా కనిపించే లేన్లు, మార్గదర్శక సూచనలు ఉండాలి. మలుపులున్న ప్రాంతాల్లో 15 ఎంఎం వెడల్పుతో రోడ్డుకు ఇరువైపులా తెలుపురంగు ఉండాలి. రాత్రిళ్లు కనపడేలా స్టడ్స్ ఉండాలి. సెన్సర్ ఆధారిత రంబుల్‌స్ట్రిప్స్ బదులు కాలం చెల్లిన స్టాటిక్ సిస్టమ్‌నే వాడుతున్నారు. వాటిని మార్చడంతోపాటు రంబుల్‌స్ట్రిప్స్ లొకేషన్స్, స్థితిగతులకు సంబంధించి సెంట్రలైజ్డ్ డేటాబేస్ అవసరం. జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీస్, ఆర్‌అండ్‌బీ, హెచ్‌ఎంఆర్‌ల మధ్య సమన్వయ లోపం వల్ల రోడ్డు నిబంధనలు సవ్యంగా అమలు కావడం లేదు.

'రాజాసాబ్' సినిమా టీజర్ విజువల్స్ చోరీ

పోలీసులకు ఫిర్యాదు

బంజారాహిల్స్: ప్రముఖ నటుడు ప్రభాస్ హీరోగా నటించిన రాజాసాబ్ సినిమా టీజర్ విజువల్స్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారని, వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలంటూ డబ్బింగ్ స్టూడియో ఇన్‌చార్జి బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-3లోని సాగర్ సొసైటీలో ఉన్న వారాహి స్టూడియోలో రాజాసాబ్ సినిమాకు సంబంధించి విజువల్స్ భద్రపరిచారు. అయితే ఈ నెల 11వ తేదీన గుర్తుతెలియని వ్యక్తులు స్టూడియోలోకి ప్రవేశించి ఈ సినిమాకు సంబంధించిన టీజర్ విజువల్స్‌ను చోరీ చేశారని, 13వ తేదీన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారని డబ్బింగ్ ఇన్‌చార్జి ఎస్.వసంత్‌కుమార్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సినిమాకు సంబంధించిన టీజర్‌ను ఫేస్‌బుక్‌లో శంకర్ బాయి, కార్తీక్ ప్రభాస్ పేరుతో, ఇన్‌స్టాలో ప్రభాస్ ఆర్మీ ఫ్యాన్ పేరుతో పోస్ట్ చేశారని, తాము అధికారికంగా విడుదల చేయాల్సిన టీజర్‌కు ముందే చోరీ చేసిన ఈ టీజర్ విజువల్స్‌ను పోస్ట్ చేశారని ఆయన ఆరోపించారు. పుటేజీలు పరిశీలించి నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు బంజారాహిల్స్ పోలీసులు ఫిర్యాదు స్వీకరించి దర్యాప్తు చేపట్టారు.

దేశంలో మతోన్మాద పాలన


మాట్లాడుతున్న జంగయ్య

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

శంకర్‌పల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం శంకర్‌పల్లి పట్టణంలోని ఓ ప్రైవేట్ గార్డెన్స్‌లో సీపీఐ 12వ మహాసభ ఏర్పాటు చేయగా.. ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని, దేశంలో మతోన్మాద పాలన కొనసాగిస్తుందన్నారు. అదే విధంగా కార్మికులకు నల్ల చట్టాలపై ఇచ్చిన హామీలపై మాట మార్చుతుందని, మావోయిస్టులపై జరుపుతున్న ఎన్‌కౌంటర్లను తక్షణమే నిలిపివేయాలన్నారు. సభలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభులింగం, మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ మంజుల, శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు సుధీర్, నాయకులు సుభాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కామాంధుడికి రిమాండ్


నిందితుడు శివ

యాచారం: మద్యం మత్తులో తొంభై ఏళ్ల వృద్ధురాలిపై లైంగిక దాడికి పాల్పడిన కామాంధుడిని పట్టుకున్న పోలీసులు, అతన్ని న్యాయస్థానంలో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. రంగారెడ్డి జిల్లా యాచారం మండల పరిధిలో ఈనెల 11న అర్ధరాత్రి ఓ తొంభై ఏళ్ల వృద్ధురాలిపై లైంగికదాడి జరిగిన విషయం విదితమే. ఈ కేసులో 20 మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు, వీరిని పలుమార్లు విచారించారు. ఈ సమయంలో గమనించిన విషయాలతో పాటు, బాధితురాలు తెలిపిన వివరాల ఆధారంగా గ్యార శివ(23) ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. శుక్రవారం అతన్ని అదుపులోకి తీసుకుని, తమదైన శైలిలో విచారించగా నిజం అంగీకరించాడు. మద్యం మత్తులో తానే ఈ దుశ్చర్యకు పాల్పడ్డట్లు వెల్లడించారు. నగరంలో ప్రైవేటు ఉద్యోగం చేసే శివ తరచూ గ్రామానికి వచ్చి వెళ్తుంటాడు. ఇతనిపై గతంలోనూ కేసులు ఉన్నట్లు తెలుస్తోంది.

నక్షత్ర తాబేళ్లు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న తాబేళ్లు

గచ్చిబౌలి: రాయదుర్గం పరిధిలో నిషేధిత నక్షత్ర తాబేళ్లు విక్రయించేందుకు యత్నించిన ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన ప్రకారం..మణికొండ సాయిరాంనగర్‌లో న్యూ బ్లే స్టార్క్ అక్వేరియం నిర్వహించే చెరుకుల బాలస్వామి నక్షత్ర తాబేళ్లు అమ్మేందుకు సిద్ధంగా ఉంచారని సమాచారం అందడంతో ఎస్‌ఓటీ, రాయదుర్గం పోలీసులు దాడులు నిర్వహించారు. నిందితుడి నుంచి నాలుగు నక్షత్ర తాబేళ్లు, రెండు రెడ్ ఇయర్డ్ స్లైడర్ తాబేళ్లను స్వాధీనం చేసుకున్నారు. అతని స్నేహితుడు సురేష్ కుమార్ చెన్నై నుంచి తాబేళ్లను సరఫరా చేస్తున్నాడు. నిందితుడు బాలస్వామికి నోటీసు జారీ చేస్తామని, తాబేళ్లను అటవీ శాఖ అధికారులకు అప్పగిస్తామని పోలీసులు తెలిపారు. మరో నిందితుడు సురేష్ పరారీలో ఉన్నాడని చెప్పారు. కేసు ఫారెస్ట్ విభాగానికి బదిలీ చేస్తామని చెప్పారు.

'విద్యుత్' మరమ్మతులపై సమాచారం ఇవ్వాలి

సాక్షి, సిటీబ్యూరో: విద్యుత్ లైన్ల పునరుద్ధరణ, మరమ్మతు పనులపై వినియోగదారులకు ఒక రోజు ముందే సమాచారం ఇవ్వాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ సంబంధిత ఇంజనీర్లకు సూచించారు. ఆటో/బైక్‌లపై సౌండ్ బాక్సులను ఏర్పాటు చేసుకుని ఆయా ప్రాంతాల్లో ప్రచారం చేయాలని, వినియోగదారుల మొబైల్ ఫోన్లకు ఎస్ఎంఎస్ ద్వారా విద్యుత్ సరఫరా నిలిపివేసే వేళలకు సంబంధించిన పూర్తి సమాచారం అందజేయాలని కోరారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా సరఫరా నిలిపివేయడం వల్ల వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని చెప్పారు. ఈ మేరకు శుక్రవారం మాన్‌సూన్ ఏర్పాట్లపై సంబంధిత ఇంజనీర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు తమ పరిధిలో నిర్వహిస్తున్న మరమ్మతు పనుల షెడ్యూల్‌ను పరిశీలించడంతో పాటు విధిగా తనిఖీ చేయాలని, సిబ్బంది స్వీయ భద్రతా చర్యలు పాటించాలని, షెడ్యూల్ ప్రకారంగా పని పూర్తి చేయాలని సూచించారు.

ఈ నెల 26 నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

రామంతాపూర్: పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన పాలిసెట్ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి రెండు విడతల్లో ప్రవేశాల ప్రక్రియ జరగనుందని రామంతాపూర్ ప్రభుత్వ జేఎన్ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌డెస్క్ కో ఆర్డినేటర్, ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్ తెలిపారు. జూన్ 24 నుంచి 28 వరకు ఆన్‌లైన్‌లో నమోదు స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చునని, జూన్ 26 నుంచి 29 వరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన, 26 నుంచి జూలై 1 వరకు ఆప్షన్ల ఎంపికకు అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. జూలై 4 నుంచి 6 వరకు అభ్యర్థులకు సీట్లు కేటాయించిన కళాశాలలో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయవలసి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

వైన్స్ ఎదుట సెల్ఫీ తీసుకున్న యువకుడిపై దాడి

మొయినాబాద్: వైన్ షాపు ఎదుట సెల్ఫీ తీసుకున్న ఓ యువకుడిపై యజమానితోపాటు సిబ్బంది దాడి చేశారు. ఈ సంఘటన మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కనకమామిడి గ్రామానికి చెందిన యువకుడు రాఘవేందర్‌రెడ్డి గురువారం సాయంత్రం మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలోని పెద్దమంగళారం రోడ్డులో ఉన్న వైన్స్‌కు వెళ్లాడు. షాపు ముందు సెల్ఫీ తీసుకున్నాడు. అది గమనించిన సిబ్బంది అతనిపై దాడి చేశారు. అంతలోనే యజమాని శ్రీనివాస్‌గౌడ్ సైతం వచ్చి ఫొటో ఎందుకు తీశావంటూ దాడిచేయడంతో సిబ్బంది రెచ్చిపోయి విచక్షణారహితంగా కొట్టారు. కర్రలతో కొట్టడంతో వీపు, కాళ్లు వాతలతో కమిలిపోయాయి. ముఖంపై గాయాలయ్యాయి. బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో వైన్స్ యజమానితోపాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

బ్రాస్ బ్యాండ్ టీమ్ ప్రదర్శన భేష్


శిక్షణ ముగింపు కార్యక్రమంలో బ్రాస్‌బ్యాండ్ టీం ప్రదర్శన

డీజీపీ డాక్టర్ జితేందర్

బండ్లగూడ: తెలంగాణ పోలీస్ అకాడమీలో 53 మంది అధికారుల బ్రాస్‌బ్యాండ్, బిగులర్ (వెలిడిక్టన్) పోలీస్ శిక్షణ ముగింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథిగా రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జితేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బ్రాస్ బ్యాండ్ టీం ప్రదర్శన చాలా బావుందని, ఇది భవిష్యత్తులో రాష్ట్రంలో బెస్ట్ బ్యాండ్‌గా గుర్తింపు పొందుతుందని ప్రశంసించారు. రాబోయే ఆగస్టు 15, రిపబ్లిక్ డే, తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఈ టీమ్‌లతో ప్రదర్శనలు ఏర్పాటు చేయిస్తామన్నారు. గతంలో 10 పోలీస్ యూనిట్స్ ఉండేవని, రాష్ట్ర విభజన తర్వాత బ్రాస్ బ్యాండ్ టీమ్స్ తక్కువగా ఉన్నాయని, అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ ముందుచూపుతో ఇలాంటి నాలుగు నెలల శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం చాలా గొప్ప విషయమన్నారు. ఇక్కడ దాదాపు 53 మంది అధికారులు కఠినమైన శిక్షణ పొందారన్నారు. అనంతరం వీరికి ప్రశంసాపత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి, అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్, అకాడమీ జాయింట్ డైరెక్టర్ డి.మురళీధర్, డిప్యూటీ డైరెక్టర్లు ఎస్.వెంకటేశ్వర్లు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Automobiles

VEHICLE FOR SALE

1No's, Honda City (TS10UB7551) Diesel 2018 Model above Car belongs to International Travel House Ltd. Ph : 99490 26716, 99594 51639 [SCA25005253]

Education

Last Chance 10th. Inter Direct Degree (Dist), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT,B.Tech,Diploma MA,M.Com,M.Sc, MBA MCA Regular/ Lateral Entry Ph: 9490577501 [H-783377]

Real Estate

Kukatpally, KPHB 3 BHK Pent Houses for Sale at Reasonable Price Located near Lodha,. Call: 7660018347 [HA-34747]

FLAT FOR SALE

3 BHK for Sale at KPHB Colony, Reasonable Price Located near Lodha, Please Contact - 8686961254 [HA-34746]

Neredmet Near Ramakrishna Puram MMTS Rly Stn. 2&3 BHK Dlx Flats Ready to Occupy, With Occupancy Certificate, No GST. Community of 75 Flats. Ph: 9440148865, 9849529518. [HA-00878]

Deluxe Pent Houses for 3 BHK Flat sale at Reasonable Price located near Lodha, KPHB. Please Contact : 91829 78658 [HA-34748]

HOUSE FOR SALE

Patancheruvu Sai Santhoshi Chitkul, 200 Sqyds House for Sale, 45Lakhs, Near Bombay Hiway 1/2 KM. Ph:9502502974 [SCA25005194]

PLOT FOR SALE

గుడ్ న్యూస్. జనగామ దగ్గర్లో వడిచెర్లలో ఫామ్‌ల్యాండ్ లాంచింగ్ ఆఫర్లో గ॥ 1999/- & RRR HMDA లిమిట్స్ చీమల కొండూరులో తక్కువ రేటుకే. 6304914366 [SCA25005221]

గుడ్ న్యూస్. ORRకి అతి దగ్గరలో HMDA ప్లాట్స్ తక్కువ రేటుకే & జనగామ వద్ద ఫామ్ ల్యాండ్ లాంచింగ్ ఆఫర్. 1999/-కే. 6304914366 [SCA25005220]

Shadnagar, Balanagar Farm Villa Plots 7.5 Lacs Plot with Reg., 1 Year EMI, Club House, Fruit Plantation, 2km from NH44, Existing Village, Studio Gated Community. Ph: 9177385251 [HA-15932]

Shadnagar, Near Microsoft data center, 1100, 1600, 2100, 200 Sq.yds HMDA layout, 100 ft masterplan commercial road facing Plots, also 200Sq.yds DTCP layout plots. 9989333244 [HA-538]

Services

BUSINESS SERVICE

మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9100329739 [H-800534]

PERSONAL CARE

CHANGE OF NAME

I, Service No. JC313264Y Rank : Sub name PRODDATUR SUBBA RAO unit 811 Engineer Eregiment ONGC (TA) Vadodara My Wife' Name Wrongly in my Army Records Entered As NIRMALA DEVI R. correct Name is PRODDATUR NIRMALA DEVI [SCA25005246]

I, Shaik Bebi John, W/o Shaik Abdul Shariff, R/o P. No: 1373, Ramnivas, Apuroopa Township, Pragathi Nagar, Hyderabad -90, have changed my Name from Bebi Sharief Shaik to Shaik Bebi John for all record purpose vide Affidavit No: 4JAA587995 Dated: 19-06-2025. [HA-00883]

I, Shaik Abdul Shariff, S/o Mastan Saheb Shaik, R/o P.No: 1373, Ramnivas, Apuroopa Township, Pragathi Nagar, Hyderabad -90, have changed my Name from Abdul Sharief Shaik to Shaik Abdul Shariff for all record purpose vide Affidavit No: 4JAA587994 Dated: 19-06-2025. [HA-00883]

I, Vishnumurty Tadi R/o Singupuram (village) Nowgam (post) Nandigam(Teh) Srikakulam (Dist) Andharapradesh Pin 53220321 have changed my minor son's name from Abhilash to Tadi Abhilash. [DA-43916]

I, REKHA. W/o. SACHIN KUMAR JAIN R/o 6-6-8 to 32, A Block, Flat No. 506, 5th Floor Necklace Pride Kavadiguda, Secunderabad 500003 I have changed my name to REKHA JAIN for all future purposes. [SCA25005282]

OLD AGE HOME

ఒమేగా హోంకేర్ ఇంటి/వంటపనికి వృద్ధులను పేషెంట్లను చిన్న పిల్లలను 24 గం.లు చూసుకొనుటకు మీ ఇంటికే కేర్ టేకర్స్‌ను పంపబడును. Ph: 9963114535 [SCA25005224]

వృద్ధులు, NRI'S లగ్జరీ రూమ్స్, లిఫ్ట్ @ మేడిపల్లి. దీర్ఘకాలిక మంచాన ఉన్న వారికి 24/7 మెడికల్, ఉప్పల్ & బోడుప్పల్. మీన్స్ భోజన వసతి. 7981467036, 9391039990, 6281125552 [H-783378]

Wanted

హైదరాబాద్‌లో ఇంట్లో ఉండి సీనియర్ సిటిజన్‌ను చూసుకుంటు ఇంటి/వంట పనిలో అనుభవం ఉన్న 50 సం॥లోపు వయసు మగ మనిషి కావలెను. వాట్సాప్ కాల్స్ : 8019188715 [SCA25005228]

ప్రముఖ బ్యాంక్ DSAలో పని చేయుటకు టెలికాలర్స్ & (వర్క్ ఫ్రం హోమ్) కావలెను. జీ : 10-20 వేలు+Incv. సంప్ర : 7993734257 [SCA25005159]

సెక్యూరిటీ కంపెనీ నందు పని చేయుటకు ఫీల్డ్ ఆఫీసర్లు కావలెను. కనీసం 10 సం॥ల అనుభవం, ఇంగ్లీష్, తెలుగు వచ్చినవారు కావలెను. వయస్సు 45 సం॥ కంటే తక్కువ. info@expertsgroupfms.com. Ph: 9885287843/8108547276 [HA-242]

MG కార్ షోరూం శంషాబాద్‌లో పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, రిసెప్షనిస్టు, మెకానిక్‌లు కావలెను. సంప్ర ॥ సెల్ : 9491402020, 9492628629. [J-538]

కొండాపూర్‌లో ఇంట్లో ఉంటూ ఇంటిపని, వంట పని చేయుటకు భార్య మరియు భర్త డ్రైవరు కొరకు కావలెను. (మంచి జీతం) Free వసతి ✆ 91779 03345 / 81791 38555 [B-615]

ప్రముఖ పేరొందిన కంపెనీలో అసోసియేట్స్‌గా పనిచేయుటకు అనుభవం కలిగిన స్త్రీ/పు., కావలెను. శాలరీ కలదు. సంప్ర : 9985944266, 8886676108 [SCA25004833]

అనుభవం ఉన్న ఫుల్ టైం డ్రైవర్. వసతి ఉన్నది. 20 వేలు, వాట్సాప్ మాత్రం ఫోన్ : 9441226838 [WB-10599]

ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో DTCP & ఫామ్‌ల్యాండ్స్ మార్కెటింగ్ చేయుటకు అనుభవం, ఉత్సాహం గల టీం లీడర్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్/ టెలికాలర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం & కమిషన్ ఇవ్వబడును. 9014409667 [SCA25005007]

Reputed Real Estate Company Required Branch Managers (Exp) For IT's Branches in Hyderabad. Ph: 9121144545 / 8121589598 [SCA25005024]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్ సెంటర్స్
సాక్షి క్లాసిఫైడ్స్
3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజిగిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహిదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453